క్లుప్తంగా

కృత్రిమ కాలు వితరణ


కృత్రిమ కాలు అందజేస్తున్న కిరణ్

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంలో తేజీవత్ రామచంద్రు అనారోగ్యం కారణంగా ఒక కాలు తొలగించగా ఆయన ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కిలారు కిరణ్ కృత్రిమ కాలు వితరణగా అందజేశారు. శనివారం గ్రామంలో రామచంద్రుకు కృత్రిమ కాలు అమర్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, బోసు, సైదులు, సిరియాల, కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి

పెనుబల్లి : లంకాసాగర్ ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ నీటి పారుదలశాఖ ఎస్ఈకు సూచించారు. మండల పరిధిలోని రాంచంద్రరావు బంజర్‌లో శనివారం దయానంద్‌ను లంకాసాగర్ ఆయకట్టు రైతులు, నాయకుడు రాజబోయిన కోటేశ్వరరావు కలిసి సాగునీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో ఎస్ఈతోపాటు డీఈని దయానంద్ ఫోన్‌లో మాట్లాడారు. డీఈ ఆదివారం లంకాసాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. నాయకులు సోమరాజు సీతారామారావు, చీకటి రామారావు, అలుగోజు చినస్వామి, కరిముల్లా, పిల్లి నవజీవన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఎనోష్‌కుమార్

కల్లూరు: దైవ సేవకులకు అండగా ఉంటూ వారి సంక్షేమం కోసం పని చేయడమే లక్ష్యంగా స్వతంత్ర క్రైస్తవ సంఘం (ఏఐసీసీ) పని చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎనోష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో పాస్టర్ యోహాన్ ఇటీవల ఒక ప్రమాదంలో గాయపడగా శనివారం ఆయన్ను పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాసి బాలరాజు, మీడియాసెల్ జిలా అధ్యక్షుడు దాసరి డేవిడ్ రాజు, మండలాధ్యక్షుడు తేళ్ల ఎబినేజర్, గౌరవ అధ్యక్షుడు సంజీవరావు, దయాకర్, సుందర్‌రాజు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం స్థానిక శ్రీలలిత రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు మండలస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికులకు పీఎఫ్ ఖాతాలేవి?

సత్తుపల్లిరూరల్: కిష్టారం ఓసీలో అసంఘటిత రంగ కార్మికులుగా పని చేస్తున్న డీఎల్ఆర్ కార్మికులకు సంవత్సర కాలంగా ఇప్పటి వరకు పీఎఫ్ ఖాతాలను తెరవలేదని ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అన్నారు. కిష్టారంలో ఓసీ ప్రాంగణంలో శనివారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ప్రతి నెల 10 లోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు కార్యదర్శి సముద్రాల సుధాకర్, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.భరణి, ఎస్‌కె అస్మత్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి తడికమళ్ల యోబుల ఆధ్వర్యంలో ఏఐటీయూసీలో చేరారు. కార్మికులు రమేష్, నాగరాజు, నాగేశ్వరరావు, జానీ, సాయికృష్ణ, వేణు, ఎస్‌కె హుస్సేన్, కె.నరేంద్ర, బి.శ్రీనివాసరావు, రామకృష్ణ, హరీష్ పాల్గొన్నారు.

పంట కాల్వ ఆక్రమణ


ఆక్రమణకు గురైన కాల్వను చూపిస్తున్న రైతులు

సత్తుపల్లిరూరల్: బేతుపల్లి పెద్దచెరువు ఎడవ కాలువ నుంచి పంట పొలాలకు వెళ్లే కాల్వను ఓ రైతు ఆక్రమించారని బేతుపల్లి గ్రామానికి చెందిన రైతులు రావిరామ్మకృష్ణ, సిద్ధిన బోయిన పుల్లయ్య చెన్ను శ్రీనివాసరావు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాల్వ నుంచి యథాస్థితిగా పొలాలకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మధిర: పిండివంటల హడావుడి

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో సంక్రాంతి సంబురాలు జిల్లాలో కూడా ప్రారంభమవుతున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన ప్రజలకు సరిహద్దులో ఉన్న ఆంధ్ర ప్రాంతం వారితో సంబంధాలు కలిగి ఉండడం, ఈ ప్రాంత యువతీ యువకులు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారిని వివాహమాడటం తదితర కారణాలతో జిల్లాలో కూడా ఆంధ్రా సంస్కృతి కనిపిస్తుంటుంది. నేడు భోగి పండుగ, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పురస్కరించుకొని మహిళలు పిండివంటలు తయారు చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు. – మధిర

సంక్రాంతికి సన్నద్ధం..

- కనుమరుగవుతున్న రోకళ్ల చప్పుళ్లు..
- పిండి మిల్లుల వద్ద రద్దీ
- వంటల తయారీలో మహిళలు బిజీబిజీ
- సెలవులకు ఇళ్లకు చేరుకుంటున్న విద్యార్థులు, బంధుమిత్రులు
- కోడిపందేలకు వెళ్లేలా ఏర్పాట్లు


కల్లూరులో పిండివంటలు చేస్తున్న మహిళలు

ఇంటింటా పిండివంటలు..

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో పండుగకు నాలుగు రోజుల ముందు నుంచే రోకళ్ల చప్పుడు వినిపించేవి. రాను రాను రోళ్లు, కుందులు కనుమరుగు అవుతుండడంతో పిండి పట్టించేందుకు పిండి మిల్లులను ఆశ్రయిస్తున్నారు దీంతో అక్కడ రద్దీగా ఉంది. మహిళలు పిండివంటలను వండుతున్నారు.

ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో సుదూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు, బంధుమిత్రులు, ఉద్యోగ, వ్యాపార రీత్యా పలుచోట్ల నివసిస్తున్న వారు వారి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు ఆంధ్రలో ఉన్న బంధువులు, మిత్రుల ఇళ్లకు వెళ్లి సంక్రాంతి సెలవుల్లో ఎంజాయ్ చేస్తుంటారు.

క్రికెట్, ముగ్గుల పోటీలు..

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మధిర పట్టణంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మధిర సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆజాద్ రోడ్డులో గత 23 ఏళ్లుగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 14న జరగబోయే ఈ పోటీల్లో వందలాది మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొంటారు. దుస్తులు కొనుగోలు చేసేందుకు ప్రజలు వస్త్ర దుకాణాలకు వెళ్తున్నారు. ఆయా వ్యాపారాలు జోరుగా కొనసాగుతున్నాయి. పతంగులను ఎగరవేసేందుకు పిల్లలు ఉత్సాహంగా ఉన్నారు. హరిదాసు కీర్తనలు మొదలయ్యాయి. గంగిరెద్దుల ఆటలు, భోగి మంటలు, ఇళ్ల ముంగిట అందమైన రంగవల్లులు తీర్చిదిద్దేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆంధ్రాలోని ప్రాంతాల్లో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కోడిపందాలను చూసేందుకు ఈ ప్రాంతానికి చెందినవారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


మధిర: పిండి మిల్లు వద్ద రద్దీ


సత్తుపల్లిలో..

పిండి వంటలు తయారీ..

మధిర పట్టణంలోని ప్రకాశం రోడ్డులో తొమ్మిదేళ్లగా విజయ హోమ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో పసందైన పిండివంటలు తయారు చేస్తున్నారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగకు సుమారు 20 మంది మహిళలతో వినియోగదారులకు అవసరమైన పిండివంటలను ఆర్డర్లపై తయారు చేస్తున్నారు. వారు తయారు చేసే పిండి వంటలు అమెరికా, రష్యా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ తదితర ప్రాంతాలకు కూడా పంపుతున్నారు

ఊరూరా సంబురాలు

కల్లూరు/ సత్తుపల్లిటౌన్/ కల్లూరురూరల్: సంక్రాంతి సంబురాలు చేసుకుంటున్నారు. ప్రతీ ఇంట్లో రంగు రంగుల ముగ్గులు, కొత్త అల్లుళ్లు, ఆడపడుచుల రాకతో, పండిన పంటలు ఇంటికి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. సాంప్రదాయ రీతిలో పండుగను జరుపుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పిండివంటల తయారీలో మహిళలు మగ్నమై ఉన్నారు.

పండుగ మంచిగా జరుపుకుంటాం


సంక్రాంతి పండుగకు పిల్లలు ఇంటికి వస్తారు. పండిన పంట ఇంటికి వస్తుంది. చుట్టాలు, బంధువలతో ఎంతో ఆనందంగా గడుపుతాము. ప్రతీ ఏటా పండుగ సందర్భంగా పిండి వంటలు వండుకుంటాం. సంక్రాంతి పండుగ ఎంతో ఆనందాన్ని ఇస్తుంది.

– గంగుల మంగతాయారు, గృహిణి, కల్లూరు

అన్ని రకాల వంటలు తయారీ


అన్ని రకాల పిండి వంటలు ఆర్డర్లపై తయారు చేస్తాం. ప్రారంభంలో మా సోదరి విజయలక్ష్మితో అరిసెలు తయారు చేయడం ప్రారంభించి ఈ రోజున సుమారు 20 మంది మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నాం. విదేశాలకు కూడా మా పిండి వంటలు, పచ్చళ్ళు ఎగుమతి అవుతుండడం సంతోషంగా ఉంది.

– ఆదెపు లత, విజయ హోమ్ ఫుడ్స్, మధిర

నాణ్యత, రుచి ముఖ్యం


నాణ్యత కలిగిన ముడి సరుకులను ఉపయోగించి పిండి వంటలు రుచికరంగా తయారు చేస్తున్నాం. ప్రతీ ఏటా వినియోగదారుల సంఖ్య పెరుగుతుంది. క్వాలిటీ లేకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. అందుకే నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా వంటలు తయారు చేస్తున్నాం.

– విశ్వనాథుల లక్ష్మి, పిండివంటల తయారీదారు

పుట్టింట్లో ఆనందంగా..


సంక్రాంతి పండుగను పుట్టింట్లో ఆనందంగా జరుపుకుంటున్నాం. ఇప్పటికే పిండి వంటలను చేశాం. ఈ పండుగ ఎన్నో మధురానుభూతులను సంవత్సరమంతా గుర్తుంచుకునేలా చేస్తుంది. కుటుంబం అంతా కలిసి ఒకేచోట పిండి వంటలు చేసుకోవటం చాలా సంతోషంగా ఉంది.

– పి.వసంతమహాలక్ష్మి, సత్తుపల్లి

పందెం పరుగులు..

- ఆంధ్రావైపు పందెం రాయుళ్లు
- కోడిపందేలు, గండాటలతో జూదం


ఆంధ్రాలో పందెం బిర్రు (ఫైల్)

సత్తుపల్లి: సంక్రాంతి వచ్చిందంటే చాలు జూదం పురివిప్పుతుంది. భోగి, సంక్రాంతి, కనుమ మూడురోజులు పందెం రాయుళ్లు ఆంధ్రా వైపు పరుగులు పెడతారు. సత్తుపల్లి నియోజకవర్గం ఆంధ్రా సరిహద్దుల్లో ఉండటంతో ఈ ప్రాంతంలో పందెలా సంస్కృతి కన్పిస్తుంటుంది. సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖులు ఆయా ప్రాంతాలలో పందెం బిర్రులు ఏర్పాటు చేయటంతో పందెం రాయుళ్లు ఆ బిర్రులకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. శీతానగరం, గురుభట్లగూడెం, రాఘవాపురం, చింతంపల్లి గ్రామాలలో చిన్న చిన్నపందెలు జరుగుతుంటాయి. పెద్దపెద్ద పందెలు వీక్షించేందుకు ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం కొండరాయిపాలెం వెళ్తున్నారు.

క్షణాల్లో జేబులు ఖాళీ..

పంటలు పండి సిరులు ఇంటికొచ్చే వేళ పందెంతో జూదరులు క్షణాల్లో జేబులు ఖాళీ చేసుకున్న సంఘటనలు మనకు కన్పిస్తుంటాయి. కోడి పందాలు ఓ వైపు జరుగుతుండగానే మరో వైపు లోనబైటా(పేకాట) లక్షల్లో పందాలు జరుగుతుంటాయి. పలు ఆటల జూదం నడుస్తుంది. రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్ వెలుగుల్లో తెల్లవారు జాము వరకు సాగుతుంది.

పసందైన విందు..

చిన్న చిన్న బిర్రుల వద్ద పందెం రాయుళ్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బిర్యాని, మద్యం విక్రయాలు చేస్తారు. పెద్దబిర్రుల వద్ద పందెం రాయుళ్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కుర్చీలు, సోఫాలతో సీటింగ్ ఏర్పాట్లు చేస్తారు. రాత్రి తోటల్లో పసందైన వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేస్తారు. వీటిని ఆస్వాదించేందుకు దూరప్రాంతాల నుంచి వీఐపీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు.

అంచనాలకు మించి అభివృద్ధి చేస్తా..

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి


లక్కీడ్రా విజేతలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: తొలిసారి మహిళా ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన నియోజకవర్గ ప్రజల అంచనాలకు మించి అభివృద్ధి చేస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి సిరి జ్యూయలరీస్ మెగా కార్ డ్రా విజేతలను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. మొదటి బహుమతిని రూ.5.90 లక్షల విలువైన కారును తాళ్లమడకు చెందిన మద్దుకూరి సతీష్, రూ.1.90 లక్షల విలువైన ద్వితీయ బహుమతి బులెట్ బైక్‌ను జగన్నాథపురానికి చెందిన జి.జయలక్ష్మి, రూ.90వేలు విలువైన తృతీయ బహుమతి స్కూటీని పిడుగు రాంబాబులు గెలుచుకున్నారు. వీరికి ఎమ్మెల్యే రాగమయి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరి అధినేత కూసంపూడి శ్రీనివాసరావు, కూసంపూడి మాధవరావు, కళ్యాన్‌రామ్, భవాని, టి.ధనలక్ష్మి, మందపాటి కేశవరెడ్డి, వంగరి పద్మారావు, నాయుడు వెంకటేశ్వరరావు, దారా ఏకాదశి మూర్తి, నారాయణ, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి పంచాయతీలోని సత్యంపేట గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంతా మండల కమిటీ ఆధ్వర్యాన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి స్థానిక క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. గంటా శ్రీను, శరత్, రాజు, దుంపా రాఘవులు, ప్రసాద్, మాధవరావు పాల్గొన్నారు.

క్రీడలు ఐకమత్యానికి దోహదం


చింతకాని: పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై


బోనకల్: ఆళ్లపాడులో..

చింతకాని: క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఎస్సై రాజేందర్ అన్నారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చెగువేర యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ఎస్సై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంబటి వెంకటేశ్వర్లు, ఆలస్యం బస్వయ్య, కోలేటి నాగేశ్వరరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, గోపాలరావు, గోపీ, లచ్చయ్య, ఆలస్యం రవి, తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: యువత చెడుమార్గాలు పట్టకుండా క్రీడలు వారికి ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్సై బొల్లెద్దు సాయికుమార్ అన్నారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో అమ్మ ఫౌండేషన్, ఆళ్లపాడు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎంపీటీసీ పారా శ్రీదేవి, నాయకులు పారా వెంకట మోహనరావు, పాపారావు, ఎస్‌కే సర్దార్, రాములు, లింగయ్య, వెంకటేశ్వరరావు, నరేష్, రవి, వెంకట్రావు, నాగభూషణం, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

వైరా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక 5 వ వార్డు సాయిబాబా మందిరం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, వైరా క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావులు మాట్లాడారు. 5వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలలో విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. జీఎంటీ కో ఆర్డినేటర్ శ్యాంబాబు, చింతలపూడి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, పుష్పలత, రాజారావు, బుచ్చిరామారావు, రజిని, అన్నపూర్ణ, సుధారాణి, మహాలక్ష్మి, సీత పాల్గొన్నారు.

మధిర: మధిర పట్టణంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం రంగవల్లుల పోటీలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల కళా ప్రదర్శనలు చేశారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చైర్మన్ వై.అనిల్ కుమార్ నెహ్రూ, ప్రిన్సిపల్ రమేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్యాం ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


వైరా: విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


మధిర: ముగ్గులను తిలకిస్తున్న విద్యార్థులు

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న కమల్‌రాజ్, తదితరులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ అంకసాల శ్రీనివాసరావు సతీమణి రాజేశ్వరీ ఇటీవల మృతి చెందగా శనివారం బాధత కుటుంబసభ్యులను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, డాక్టర్ కోటా రాంబాబు, నాయకులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పంబి సాంబశివరావు, దివ్వెల వీరయ్య, సర్పంచ్ ముల్పూరి స్వప్న, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి


నివాళులర్పిస్తున్న హేమంతరావు

చింతకాని: అమరవీరుల ఆశయాలను సాధించే దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు తెలిపారు. మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో నాయకులు, మాజీ సర్పంచ్ చాట్ల ఏసు సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసు సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్‌గా, పార్టీ నాయకునిగా గ్రామంతో పాటుగా పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఏసు చేసిన సేవలను కొనియాడారు. సర్పంచ్ చాట్ల సురేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సింగు నర్సింహారావు, ఏపూరి రవీంద్రబాబు, రావి శివరామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఏనుగు గాంధీ, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, పదిమెల వెంకటనర్సయ్య, పిట్టల రాంబాబు, విజయ్, చాట్ల బాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, నాయకులు గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం పెంపొందించుకోవాలి


దుస్తులు అందజేస్తున్న ఏసీపీ రామానుజం

పెనుబల్లి : ప్రతి ఒక్కరూ సేవాభావం పెంపొందించుకోవాలని, తోటివారికి సాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని ఏసీపీ బి.రామానుజం అన్నారు. మండలకేంద్రంలోని శ్రీరామా మాత్య సేవ సమితి ఆధ్వర్యంలో శనివారం పెనుబల్లి, వీఎం బంజర్ గ్రామాలకు చెందిన పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్ హనుక్, ఎస్సై వీ.సురజ్, సేవాసమితీ నిర్వాహకులు ఎర్రగొర్ల వెంకటేశ్వరరావు, వేముల నర్సింహారావు, వంగా గిరిజాపతిరావు, మేకతొట్టి కాంతయ్య, కొత్తగుండ్ల అప్పారావు, మారుతి నారాయణ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన


సత్తుపల్లిరూరల్: నారాయణపురంలో పథకాలను వివరిస్తున్న శ్రీనివాసరావు


ఎర్రుపాలెంలో..

సత్తుపల్లిరూరల్: వికసిక్ భారత్ కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి మండలంలోని నారాయణపురంలో శనివారం కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ మండలాధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాసరావు ప్రజలకు వివరించారు. ప్రధాని మోదీ తొమ్మిదిన్నర ఏళ్లలో పేద ప్రజలను ఉద్దేశించి చేసినటువంటి పథకాలలో కింద స్థాయి లబ్ధిదారులకు అందించాలనే సదుద్దేశ్యంతో ప్రవేశపెట్టిన పథకాలను వాటి ఆవశ్యకతను వివరించారు. సర్పంచ్ రంగారావు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ శ్రీనివాసులు కోరారు. శనివారం మండలకేంద్రంలోని గాంధీ సెంటర్‌లో వికసిత్ భారత సంకల్ప యాత్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సదుపాయాలను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వివరించారు. సర్పంచ్ మొగిలి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఎన్ఎం స్నేహ, ఏపీఎం వెంకటేశ్వర్లు, బీజేపీ మండలాధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావు, నాయకులు దేవరకొండ కోటేశ్వరరావు, చంద్రమౌళేశ్వరరావు, బొల్లయ్య, తదితరులున్నారు.

రామయ్య అక్షింతల పంపిణీ


కల్లూరు రూరల్: నారాయణపురంలో అక్షింతల ఊరేగింపు

కారేపల్లి: అయోధ్య నుంచి అక్షింతలను మండలంలోని కారేపల్లి, వెంకటసాయినగర్, ఉసిరికాయలపల్లి, పేరుపల్లి గ్రామాల్లో శనివారం భక్తులు ప్రదర్శన నిర్వహిస్తూ ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. తురక నారాయణ, జంగా వెంకటేశ్వర్లు, పిల్లి వెంకటేశ్వర్లు, చిరునోముల రామారావు, రంగనాథ్, ఉడతల సంపత్, రాజు, సాయి భరత్, మధు, పేరుపల్లి, ఉసిరికాయలపల్లి సర్పంచులు అజ్మీర నాగేశ్వరరావు, బాణోతు బన్సిలాల్, ఉప సర్పంచ్ బుడిగ ప్రభాకర్, మూడ్ మోహన్ చౌహాన్, ఎంపీటీసీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కారేపల్లిలో..

కల్లూరు రూరల్: అయోధ్య రామయ్య అక్షింతలు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఇంటింటికి పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, అంజిరెడ్డి, పొంగులేటి నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.